క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: కొరుప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం వమ్మవరం, గెద్ద పాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలోని విద్యుత్ లైన్లలో ఆర్‌డీఎస్‌ఎస్ పనుల నిమిత్తం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామన్నారు.

నీరు పోయే మార్గం ఏదీ?



డ్రైనేజీ సదుపాయానికి నోచుకోని రహదారి

మునగపాక: మేజర్ పంచాయతీ మునగపాక బీసీ కాలనీలో పలు చోట్ల డ్రైనేజీ సదుపాయాలు లేక కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. గతంలో మాజీ శాసనసభ్యుడు యూవీ రమణమూర్తిరాజు హయాంలో బీసీ కాలనీలో కొన్ని వీధుల్లో డ్రైనేజీ సదుపాయం కల్పించారు. ఇంకా పలు వీధుల్లో కాలువలు లేవు. దీంతో వర్షాకాలంలో ఏ కొద్దిపాటి వర్షం కురిసినా నీరంతా రహదారిపై నిలిచిపోతోంది. రోజుల తరబడి నీరు బయటకు పోయే అవకాశం లేకుండాపోయింది. దీంతో రాకపోకలు సాగించేందుకు స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి కాలనీలో పూర్తి స్థాయిలో డ్రైనేజీ సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.

శరవేగంగా వెంకన్న ఆలయ నిర్మాణం



మునగపాకలో నిర్మాణంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులో తలపెట్టిన వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.5 కోట్ల వ్యయంతో ఆలయ నిర్మాణం చేపట్టేందుకు గ్రామస్తులు నిర్ణయించారు. ఈ మేరకు భక్తుల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు. ప్రస్తుతం సంబంధిత ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయ నిర్మాణంలో భాగస్వాములవుతున్నారు. ఆలయ నిర్మాణం మరింత వేగవంతమై భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మరింత ఆర్థిక సహకారం అందించాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.

కాలువ పనులకు భూమి పూజ



భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు స్వామి సత్యనారాయణ

మునగపాక: గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ కోరారు. మునగపాక బీసీ కాలనీలో రూ.7.50 లక్షల జిల్లా పరిషత్ నిధుల ద్వారా ఏర్పాటు చేయనున్న కాలువ పనులకు ఆయన శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జిల్లా పరిషత్ కోటా ద్వారా వచ్చే నిధులతో అవసరం మేర రహదారులు, కాలువలు నిర్మిస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ అభివృద్ధికి సహకరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు పంపిణీ చేస్తున్న కుసుమ కావ్య ఫౌండేషన్ ప్రతినిధులు

ఎస్.రాయవరం: ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలని కుసుమ కావ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శానాపతి బాబూరావు అన్నారు. సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా కోనవానిపాలెం గ్రామంలో శుక్రవారం ఉచితంగా మొక్కలు పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు చేకూరి శ్రీరామచంద్రరాజు, స్థానిక నాయకులు కోన అప్పలరాజు, దమ్ము రాజు, తదితరులు పాల్గొన్నారు.

హరితం.. అంతం.!

- కొండల్లో అక్రమార్కుల ఆగడాలు
- పచ్చని చెట్లను నరికి బొగ్గులుగా మారుస్తున్న వైనం
- కోటవురట్ల మండలంలో జోరుగా బొగ్గు వ్యాపారం
- కొరవడిన అటవీశాఖాధికారుల పర్యవేక్షణ



బొగ్గు తయారీకి ఉపయోగపడుతున్న కొండలపై ఉన్న చెట్లు



రవాణాకు సిద్ధంగా బొగ్గు బస్తాలు



కాల్చడం కోసం సిద్ధం చేసిన కలప



బొగ్గు కోసం గొయ్యిలో కలప పాతి పెట్టి కాల్చుతున్న దృశ్యం

కోటవురట్ల: అక్రమార్కుల కన్నుపడితే అది ఇసుకైనా, గ్రావెల్ అయినా, పచ్చని వనాలైనా మాయం కావలిసిందే. కాసులు వెనకేసుకోవడానికి అడ్డదారులు తొక్కేందుకు కొంతమంది వెనుకాడడం లేదు. చట్టాలకు భయపడేదే లేదంటూ దోచేస్తూనే ఉన్నారు. మండలంలో బొగ్గు అక్రమ రవాణా కాసుల వర్షం కురిపిస్తోంది. బొగ్గులకు మంచి డిమాండ్ ఉండడంతో పచ్చని కొండలు అక్రమార్కుల కన్నుపడి బొగ్గులుగా మారిపోతున్నాయి. అటవీ సంపద అడ్డదారిలో అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోతోంది. అటవీ శాఖాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అక్రమార్కులు పేట్రేగిపోతున్నారు. ఏడాది పొడవునా బొగ్గు అక్రమ రవాణా చేస్తూ రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. బొగ్గు అక్రమ రవాణాకు కొన్ని గ్రామాలు ఓ ట్రేడ్‌మార్కులా మారిపోయాయి. ఈ బొగ్గు వ్యాపారం కొండలు, అటవీ ప్రాంతం ఎక్కువగా ఉన్న పందూరు, రామచంద్రపురం, అల్లుమియ్యపాలెం, అణుకు, బంద, ములగల్లోవ, గూడెపులోవ గ్రామాల్లో జరుగుతోంది. పలువురు బొగ్గు వ్యాపారాన్ని కుల వృత్తిలా మార్చుకుని మహా దర్జాగా కొనసాగిస్తున్నారు. అటవీ భూముల్లోని చెట్లను నరికి కాల్చి బొగ్గుగా మారుస్తున్నారు. ఆపై మూడు ఆటోలు, ఆరు వ్యాన్లుగా బొగ్గు అక్రమ వ్యాపారం జోరుగా సాగిపోతోంది.

బొగ్గు తయారీ ఇలా..

కొండల్లోకి వెళ్లిన అక్రమార్కులు ముందుగా బొగ్గు తయారీకి అనువైన చెట్లను గుర్తించి నరికేస్తారు. ముక్కలుగా నరికి రెండు రోజుల పాటు ఎండకు ఆరబెడతారు. పెద్ద గొయ్యి తీసి అందులో మంట రాజేసి నరికిన కలపను మండిస్తారు. అగ్గి రాజుకున్నాక వాటిపై చెట్ల ఆకులు, చిన్న కొమ్మలు కప్పి మట్టి వేసి పొగ బయటకు పోయేలా కర్రలు గుచ్చి ఉంచుతారు. మర్నాటి వరకు కొంచెం కొంచెంగా కాలి బొగ్గులుగా మారిపోతాయి. రెండు రోజులు మట్టిలోనే ఆరనిచ్చి ఆపై బయటకు తీసి బొగ్గులను బస్తాల్లోకి చేరుస్తారు. ఇలా బొగ్గు తయారీకి ఒక్క రూపాయి ఖర్చు చేయకుండానే అటవీ సంపదను కొల్లగొట్టి రూ.లక్షలు కూడబెడుతున్నారు. ఇది నిరంతర ప్రక్రియలా కొనసాగుతున్నా అటవీ శాఖాధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం.

చుట్టు పక్కల పట్టణాలకు యథేచ్ఛగా తరలింపు

వారం రోజుల పాటు నిల్వ చేసిన బొగ్గులను ఆటోలు, వ్యానుల ద్వారా అక్రమ రవాణా చేస్తున్నారు. ఇక్కడి నుంచి అనకాపల్లి, విశాఖపట్నం, తుని, రాజమహేంద్రవరం, కాకినాడ, విజయవాడ తదితర పట్టణాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. బొగ్గుల బస్తా రూ.2 వేలు వరకు విక్రయించి అడ్డదారిలో రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. కొండల్లో నుంచి బైకులపై ఓ చోటకు చేర్చి అక్కడి నుంచి ఆటోలు, వ్యాన్ల ద్వారా పట్టణాలకు తరలిస్తున్నారు. కొందరైతే నర్సీపట్నం రైల్వే స్టేషన్ కేంద్రంగా ట్రైన్లలో బొగ్గుల బస్తాలను తరలిస్తున్నారు. అక్రమ వ్యాపారానికి అధికారుల అండదండలు ఉండడం వల్లనే సాఫీగా సాగిపోతోందన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే హరిత వనాలు హరించిపోయి రాళ్లతో కొండలు మాత్రమే మిగులుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హరితం హరించి కాలుష్యం కోరలు చాస్తుందని ఆందోళన చెందుతున్నారు.

నిఘా పెట్టి చర్యలు తీసుకుంటాం

అక్రమ బొగ్గు వ్యాపారంపై సమాచారం లేదు. సిబ్బందితో నిఘా పెట్టి దాడులు చేయిస్తాం. ఎవరైనా కలపను నరికి అక్రమాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. స్థానికులు సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

– రాజేష్, రేంజర్, అటవీ శాఖ, నర్సీపట్నం డివిజన్

నిర్వాసితులకు అన్యాయం జరిగితే సహించం

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం
- తమ్మయ్యపేటలో నిర్వాసితులతో సమావేశం



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం

నక్కపల్లి: కంపెనీల ఏర్పాటు కోసం ఏపీఐఐసీకి భూములు, నివాస ప్రాంతాలు ఇచ్చిన నిర్వాసితులకు అన్యాయం జరిగితే సహించేది లేదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం హెచ్చరించారు. తమ్మయ్యపేటలో నిర్వాసితులతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్వాసితులను తప్పుదోవపట్టిస్తోందన్నారు. ప్రలోభాలకు, బెదిరింపులకు గురిచేస్తోందన్నారు, నిర్వాసిత కుటుంబాల్లో మేజర్లకు వివాహితులైన, వివాహం కాని ఆడపిల్లలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని ఏడాది నుంచి ఆందోళన చేస్తున్నామన్నారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలని బాధితులు ఉద్యమాలు చేస్తూంటే ప్రభుత్వం స్పందించకపోగా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద కేవలం రూ.8.90 లక్షలు చెల్లిస్తామంటూ నిర్వాసితుల బ్యాంకు ఖాతాలు సేకరించడం దుర్మార్గమన్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.25 లక్షలు చెల్లించాల్సిందేనన్నారు. నిర్వాసితులెవరూ తొందర పడి బ్యాంకు ఖాతాలు ఇవ్వొద్దన్నారు. ఒకసారి పరిహారం బ్యాంకులో జమ చేస్తే వాటితోనే సరిపెట్టుకోవాల్సి వస్తుందని సూచించారు. సుప్రీంకోర్టు తీర్పుననుసరించి నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించాల్సిందేనని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బెదిరింపులకు భయపడొద్దన్నారు. కంపెనీల కోసం భూములు త్యాగం చేస్తున్న నిర్వాసితులకు న్యాయం చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజలు, రైతుల కంటే కార్పొరేట్ శక్తులే ప్రధానమన్న భావనతో ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. పోరాటాలు, కోర్టులను ఆశ్రయించడం ద్వారానే రైతులకు న్యాయమైన నష్టపరిహారం దక్కుతుందన్నారు. రైతుల్లో అనైక్యత తీసుకొచ్చి ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని దుయ్యబట్టారు. నిర్వాసితులకు అండగా నిలుస్తానని, వారి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన హోంమంత్రి అనిత ఇప్పుడు నోరు మెదపడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, మండల కన్వీనర్ ఎం.రాజేష్, రైతులు రాము, అప్పారావు, రమేష్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

300 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు



విద్యార్థికి కంటి పరీక్ష చేస్తున్న నేత్ర వైద్యుడు వెంకటరావు

కోటవురట్ల: కంటి సంరక్షణలో విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని నక్కపల్లి ఏరియా ఆస్పత్రి నేత్ర వైద్యుడు బి.వెంకటరావు సూచించారు. స్థానిక పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నేత్ర పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. 300 మంది విద్యార్థులను పరీక్షించి, 30 మందికి కళ్లద్దాలు అవసరం ఉన్నట్టు గుర్తించారు. వారికి కళ్లద్దాలను ఉచితంగా అందిస్తామని డాక్టరు వెంకటరావు తెలిపారు. కంటి సమస్యల పట్ల అశ్రద్ధ చేయకుండా వెంటనే చికిత్స చేయించుకోవాలన్నారు. ఈ నెల 23, 25 తేదీలలో స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేస్తామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సుకుమార్, ఉపాధ్యాయులు కృష్ణ, వెంకటరత్నం, గణేష్, బాలు, కిషోర్ పాల్గొన్నారు.

రేగుపాలెంలో డీఎల్‌డీవో పర్యటన



రేగుపాలెంలో పారిశుధ్యం పరిశీలిస్తున్న డీఎల్‌డీవో మంజులవాణి

యలమంచిలి రూరల్: మండలంలోని రేగుపాలెంలో డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి మంజులవాణి శుక్రవారం పర్యటించారు. గ్రామంలో పారిశుధ్య పరిస్థితులు, తడి, పొడి చెత్త సేకరణ, పారిశుధ్యంకు సంబంధించి ప్రభుత్వం ఐవీఆర్‌ఎస్ కాల్స్ ద్వారా ప్రజల నుంచి సేకరిస్తున్న అభిప్రాయాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. వంద శాతం బహిరంగ మలవిసర్జన రహిత గ్రామంగా రేగుపాలెం పంచాయతీని తీర్చి దిద్దినట్టు సర్పంచ్ రాజాన మహాలక్ష్మి డీఎల్‌డీవోకు వివరించారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం బాగున్నట్టు గ్రామంలో పర్యటించిన డీఎల్‌డీవో అభిప్రాయపడినట్టు సర్పంచ్ తెలిపారు. రేగుపాలెం గ్రామాన్ని కేంద్ర పురస్కారానికి నామినేట్ చేయనున్నట్టు డీఎల్‌డీవో చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ దీపిక, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ నెలాఖరు వరకూ లంపీ స్కిన్ టీకాల కార్యక్రమం



వి.సంతపాలెంలో బ్లాంకెట్ సర్వేను పర్యవేక్షిస్తున్న డీడీ చంద్రశేఖర్

కె.కోటపాడు: లంపీ స్కిన్ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ముందస్తుగా తెలుపు రంగు జాతి పశువులకు ఈ నెల 1 నుండి టీకాలు వేస్తున్నట్లు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. వి.సంతపాలెం, ఎ.కోడూరు గ్రామాల రైతులకు అందుతున్న సేవలను తనిఖీ చేశారు. నెలాఖరు నాటికి శతశాతం టీకాల కార్యక్రమం పూర్తి చేయాలని తెలిపారు. వర్షాకాలంలో పశువులు వ్యాధుల బారిన పడకుండా రైతులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొరువాడ పశు వైద్యాధికారి సింహాచలంనాయుడు, పశువైద్య సహాయకురాలు అల్లు మంగ పాల్గొన్నారు.

జనరల్ నోటీసు

మా క్లయింటులు, అనకాపల్లి జిల్లా S.రాయవరం మండలం, తిమ్మాపురం గ్రామ కాపురస్తులు అయిన (1) బదిరెడ్డి అప్పారావు కుమారుడు లోవరాజు (2) సమ్మంగి రమణగారి కుమారుడు గోవిందు గార్లు మాకిచ్చిన భోగట్టాపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా..

ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తికి S.రాయవరం మండలం, పెదగుమ్ములూరు గ్రామ కాపురస్తులు (1) గుర్రం (లేటు) నాగరాజు గారి కుమారుడు రమణ, S.రాయవరం మండలం తిమ్మాపురం గ్రామ కాపురస్తులు, ప్రస్తుతం కాకినాడ సంజయ్‌నగర్, గణేష్‌నగర్ కాపురస్తులు అయిన (2) గుర్రం (లేటు) మాణిక్యం గారి కుమారుడు రమేష్ వగైరాలు పూర్తి హక్కుదారులు అయివుండి, నిరాటంకముగా అనుభవించుచూ వారి అవసరములు నిమిత్తము అమ్మజూపగా మా క్లయింటులు షెడ్యూల్ ఆస్తిని కొనుగోలు చేయుటకు సంసిద్ధత వ్యక్తపరచుచున్నందున షెడ్యూల్ ఆస్తి విషయమై ఎవరికి ఎట్టి అభ్యంతరములు వున్న ఈ తేది లగాయితూ 1 వారము దినములు లోగా ఈ దిగువ తెలిపిన అడ్రసుకు వ్రాతమూలముగా తెలియజేయవలెను. అట్లు కాని యెడల ఎటువంటి అభ్యంతరములు లేనట్లుగా పరిగణించబడుగునని యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూల్

అనకాపల్లి జిల్లా S.రాయవరం మండలం, తిమ్మాపురం రెవెన్యూ గ్రామం, సర్వే నెంబరు 119/10, LPM No. 820 గల 127.10 చదరపు గజములు విస్తీర్ణము గల ఖాళీ స్థలమునకు కొలతలు మరియు

హద్దులు:

తూర్పు: 55.6 అడుగులు - గుర్రం రాంబాబు గారి ఇల్లు
పడమర: 52 అడుగులు - లంక బంగియ్యాచార్యులు గారి స్థలము
ఉత్తరము: 19.6 అడుగులు - గుర్రం గోవింద వగైరాలు
దక్షిణము: 23.6 అడుగులు - దేవపోలవరం పోవు రోడ్

రాజాన గోవిందరావు
అడ్వకేటు, యలమంచిలి
సెల్: 9848460118

యలమంచిలి
తేది: 22-08-2025

ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం



ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దార్ మూర్తి

నక్కపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో హెటెరో రసాయన పరిశ్రమ యాజమాన్యం సహకారంతో 20 లీటర్ల ఆర్‌వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. సుమారు రూ.50 వేలు విలువ గల ఈ ఆర్‌వోప్లాంట్ ద్వారా రోజుకు 50 నుంచి 100 మందికి తాగునీరు సరఫరా చేయవచ్చని హెటెరో ప్రతినిధులు తెలిపారు. దీనిని శుక్రవారం తహసీల్దార్ నర్సింహమూర్తి ప్రారంభించారు. కార్యాలయ సిబ్బంది, వివిధ పనుల కోసం వచ్చే ప్రజలకు ఉపయోగపడేలా ఆర్‌వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన కంపెనీ యాజమాన్యానికి తహసీల్దార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ నారాయణరావు, కంపెనీ సీఎస్‌ఆర్ సిబ్బంది శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం



కేజీబీవీలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

నక్కపల్లి: మత్తు పదార్థాలకు బాల, బాలికలు దూరంగా ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ సంస్థ ప్రతినిధి లోవరాజు, కేజీబీవీ ప్రిన్సిపాల్ సలీమాలలు అన్నారు. శుక్రవారం కేజీబీవీలో బాలల పరిరక్షణ సంస్థ, సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల బాలికలు ఆధునిక పోకడలకు అలవాటు పడి మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారన్నారు. మత్తు పదార్థాలతో పాటు బాల్య వివాహాలను కూడా అరికట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఇలా చేయడం వల్ల చాలా మంది చిన్న వయసులోనే అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారన్నారు. 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని, కానిపక్షంలో చట్టపరమైన ఇబ్బందులు కూడా ఎదుర్కొవలసి వస్తుందని హెచ్చరించారు. తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించే బాధ్యత విద్యార్థినీ, విద్యార్థులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, సీడ్ సంస్థ ప్రతినిధి అమ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



అరట్లకోటలో ఓరుగుంటాలమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పాయకరావుపేట: శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా ఆయా గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అరట్లకోట గ్రామంలోని ఓరుగుంటాలమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దుర్గాలమ్మ చెట్టు అమ్మవారు, దుర్గాంబిక, నూకాలమ్మ, సత్తెమ్మతల్లి, తదితర అమ్మవారి ఆలయాల్లో మహిళలు కుంకుమ పూజలు చేశారు.

మత్స్యకారుల ఉపాధిపై కొడితే ఊరుకునేది లేదు

- ప్యాకేజీ అమలు, పరిహారం చెల్లింపుల్లో పారదర్శకత ఉండాలి
- ప్రత్యామ్నాయ ఉపాధి చూపాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
- వైఎస్సార్‌సీపీ యలమంచిలి సమన్వయకర్త కరణం ధర్మశ్రీ



రాంబిల్లి మండలంలో జరిగిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ

రాంబిల్లి(అచ్యుతాపురం): మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసేలా చర్యలు తీసుకుంటే ఊరుకునేది లేదని వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. రాంబిల్లి మండలంలోని కొత్తపట్నం, వాడనర్సాపురం, గోవిందపాలెం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' రచ్చబండ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన స్థానికులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఒకవైపు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కుతూనే మరో వైపు వివిధ వర్గాలకు చెందిన ఉపాధి అవకాశాలపై ఉక్కుపాదం మోపుతోందని ఆరోపించారు. నియోజకవర్గంలో ఉన్న విశాలమైన తీర ప్రాంతం పరిధిలోకి పరిశ్రమలు వస్తున్నాయని ఆనంద పడాలో.. వాటి కారణంగా మత్స్యకారుల జీవితాలు అగమ్యగోచరంగా మారుతున్నాయని బాధ పడాలో అర్థం కావడం లేదన్నారు. పరిశ్రమల వల్ల మత్స్యకార గ్రామాల్లో చేపల వేటకు ఆటంకాలు, ఇబ్బందులు ఏర్పడుతున్నందున తగిన రీతిలో ప్యాకేజీలు ఇచ్చి, ప్రత్యామ్నాయ ఉపాధికి ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తపట్నం మత్స్యకారుల ఉపాధికి తీవ్ర విఘాతం ఏర్పడిందన్నారు. వాడనర్సాపురంలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ సక్రమంగా అమలు చేయాలని, పైడమ్మ చెరువుకు ప్రత్యామ్నాయంగా ఉపాధి కల్పించి, గ్రామాన్ని తరలించాల్సి వస్తే నేవల్ అధికారులు పెన్సింగ్ వేయాలని కోరారు.

నియంతృత్వ పోకడలు అవలంబిస్తే సహించమని హెచ్చరించారు. వేట నిషేధ ప్రాంతాల్లో పరిహారం, ప్యాకేజీలు, ఉపాధి ప్రత్యామ్నాయాలు, గ్రామాల తరలింపు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీల్లో ఎటువంటి అవకతవకలు జరిగినా సహించమని ధర్మశ్రీ హెచ్చరించారు. బాబు హయాంలో ఎప్పుడూ హామీల అమలు తుంగలో తొక్కే అలవాటు ఉందన్నారు. కూటమి ప్రభుత్వ ఆగడాలపై నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నూతన కమిటీ నియామకాలు త్వరగా పూర్తి చేసి, పార్టీ మరింత పటిష్టం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎంపీపీ శిరీషా శ్రీనుబాబు, జెడ్పీటీసీ నాగరాజు, ప్రచార కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, కేజీపాలెం సర్పంచ్ హరిబాబు, కొత్తపేట సర్పంచ్ అరుణలత, వై.లోవ సర్పంచ్ లోవరాజు, కారే రామారావు, ఎంపీటీసీలు నర్సింహాంలు, చింతకాయల పెంటయ్య, కొవిరి వెంకటేష్, దొలపల్లి నాగరాజు, సోమేష్, గంటలరావు, పేర్ల వెంకటేశ్వరరావు, చింతకాయల దేముడు, వాసుపల్లి తేజ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కోర్టులో ధిక్కరణ కేసు వేస్తాం



బ్రిటిష్ సమాధులను పరిశీలిస్తున్న అజశర్మ

నర్సీపట్నం: స్థానిక బ్రిటీష్ సమాధుల స్థలంలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను కూల్చకపోతే కోర్టు ధిక్కరణ కేసు వేస్తామని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటానికి గుర్తుగా ఉన్న బ్రిటిష్ సమాధులను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అజశర్మ మాట్లాడుతూ అల్లూరి పోరాటానికి స్మృతిగా ఉన్న బ్రిటిష్ సమాధుల స్థలం అక్రమించి నిర్మాణాలు చేస్తుంటే రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ కట్టడాలని కూల్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి వేదిక నాయకులు శాస్త్రి, టాక్స్ పేయర్ అసోసియేషన్ నాయకులు కె.త్రిమూర్తులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎగుమతి, దిగుమతులపై ఆంక్షలు తగదు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని ఎగుమతి, దిగుమతి వాహనాలపై సమయ వేళలపై పోలీస్ శాఖ పెట్టిన ఆంక్షలను తక్షణమే ఉపసంహరించుకోవాలని పట్టణ ముఠా కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు గంటా శ్రీరామ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా కేంద్రంలో వివిధ ప్రాంతాల నుంచి రోజూ సరుకులు తీసుకురావడానికి అనేక లారీలు వస్తుంటాయన్నారు.

వ్యవసాయ అధికారుల విస్తృత పర్యటన



వరినాట్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

అచ్యుతాపురం: మండలంలోని హరిపాలెం, అందలాపల్లి గ్రామాల్లో వ్యవసాయ పరిశోధన స్థానం, కృషి విజ్ఞాన కేంద్రం, స్థానిక వ్యవసాయ అధికారుల బృందం శుక్రవారం విస్తృతంగా పర్యటించింది. వరి నారుమడులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. చాలా చోట్ల వరినారు ఆరోగ్యకరంగా ఉందని, కొన్ని చోట్ల వరి ఈగ ఆశించిందని గుర్తించారు. ఆకు ముడత తెగులు, కాండం తొలుచు పురుగు ఆశించకుండా ఉండేందుకు తగిన మందులు వాడాలని, కలుపు నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నాట్లు వేసేటప్పుడు వరుసలు పాటించాలన్నారు. అనకాపల్లి పరిశోధనా స్థానం శాస్త్రవేత్త భవానీ, యలమంచిలి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి, బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త నాగేంద్ర, ఏవో శంకర్ గోవింద్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.